# జలయజ్ఞ సమిధలు

కథ

ధేనువకొండ శ్రీరామమూర్తి

ప్రపంచ స్థాయిలో సాఫ్ట్‌వేర్ అవకాశాలు వ్యాపారపరంగా అభివృద్ధిపరచుకొనేందుకు 'ది లీడర్‌షిప్ రౌండ్ టేబుల్' సమావేశాన్ని హైటెక్స్ సమావేశ మందిరంలో రాజుగారు ఏర్పాటు చేశారు. ప్రపంచ స్థాయిలోని సంస్థలను ఆహ్వానించి చాలా భారీ స్థాయిలో ఏర్పాటు చేసి సంచలనం సృష్టించారు. కొద్ది రోజులలో జరుగుతుంది.

రాజు, నేను చిన్ననాటి స్నేహితులం. మా అమ్మమ్మగారి వూరు బాపట్ల. స్కూలు శలవుల్లో కలుసుకునేవారం. రాజును కలుసుకునేందుకే శలవలకు మా అమ్మమ్మ గారింటికి వెళ్ళేవాడిని. రాజు కూడా ఎక్కడో చదువుకునేవాడు శలవలకు తప్పక వచ్చేవాడు. తరువాత తరువాత కలవకపోయినా ఉభయులం సంగతులు తెలుసుకునేవారం.

'కులవృత్తికి సాటిరాదు గువ్వలచెన్నా' చిన్నప్పుడు చదివింది అక్షర సత్యమయింది నా విషయంలో. మాది పూల వ్యాపారం. తరతరాలుగా పూలతోటలు కుటుంబానికి ప్రధాన సేద్యపు వనరు. మా మేనమామలు పొగాకు సేద్యానికి బళ్ళారి ప్రాంతం వెళ్ళి స్థిరపడడం నా చదువులు పూర్తి అయాక వారి దగ్గరకు వెళ్ళి పూలవ్యాపారం కొనసాగిస్తూ బెంగుళూరులో స్థిరపడటం కాల ప్రవాహంలో జరిగిపోయింది.

అనుకోకుండా బెంగుళూరు ఎయిర్‌పోర్టులో రాజును కలవడం జరిగింది. ఆనందం ఉవ్వెత్తున ఎగిసింది. ఎందుకంటె రాజు గురించి వార్తలు వింటూ వింటూ ఆనందపడ్డానేగాని నేరుగా చూసేప్పటికి సంతోషం పట్టలేకపోయాను. తను వార్తలలోని వ్యక్తి. నేనే ముందుగా గుర్తుపట్టి పలకరించాను.

షరామర్శలు అయ్యాక ఈ సమావేశం ఏర్పాట్ల గురించి బెంగుళూరు వచ్చినట్లు చెప్పాడు.


"ఒరేయ్, నీ పూల సంగతి హైదరాబాద్‌లో చూపించరా! డెకరేషన్ అరేంజ్‌మెంట్ నీవే చూసుకో!"


ఆత్మీయంగా సంబోధించేప్పటికి పులకించిపోయాను.

"ఎన్నో అంతర్జాతీయ సమావేశాలకు ఏర్పాట్లు చేశాను కాని నీతో పనిచేయడం సంతోషం, తప్పక ఛాలెంజ్‌గా తీసుకుంటానురా" సంతోషంతో ఒప్పుకున్నాను.

ఆ క్షణం నుంచే యాక్షను ప్లాను మొదలయింది. బెంగుళూరులో దొరికే లిల్లి, జర్‌బరా, కార్నేషన్, డచ్‌రోజ్, గోల్డెన్‌రాడ్, ఆర్కిడ్స్, ఆంథోరియమ్ పూల సేకరణకు ఏర్పాట్లు మొదలెట్టాను.

బెంగుళూరు నుంచి పూల వ్యాపారం బాగా సాగుతుంది విమానాల ద్వారా పూల సరఫరా జరుగుతుంది. వివిధ ప్రాంతాలలోని





వూరుప్రక్కగా గుండ్లకమ్మ నది ప్రవహిస్తుంది. గుండ్లకమ్మ నది ఒడ్డువెంట మందారయ్య కుటుంబం పొలాలు. ప్రతి సంవత్సరం నదికి వరదలు వచ్చేవి. గుండ్లకమ్మ వరదలతో తోటలలో ఒండ్రు పట్టేది. పూల తోటలకు వేరే ఎరువు అవసరం అయేది కాదు. సంవత్సరానికి రెండుసార్లు పూల కాపు. విరగబూసేవి తోటలు. అటు మద్రాసు, ఇటు విజయవాడ దాకా పూల వ్యాపారం. మందారయ్య కుటుంబానికి పూలకు ఏదో జన్మాంతర సంబంధం వుందని విశ్వాసం.

స్టార్ హోటళ్ళకు, కార్పొరేట్ ఆఫీసులకు ఇక్కడ నుంచే సప్లయి జరుగుతుంది. పూలు తాజాగా వుంటేనే వాటి అందం. ఏ కొంచెం వాడినా పక్కన పడవేయాల్సిందే. రవాణాలోనూ అత్యంత జాగ్రత్తలు తీసుకుంటాం. విమానాల ద్వారా కొన్ని పూలు ఎగుమతి అవుతాయి. లాభసాటి వ్యాపారమే అయినా జాగ్రత్త, సమయ పాలన అవసరం.

రాజు నుంచి ఫోను వచ్చింది.

"ఏరా, ఏర్పాట్లు ఎట్లా సాగుతున్నాయి"

"ఆ ప్రయత్నాలలోనే వున్నాను. నీకు ఇబ్బంది కలిగించను గదా!"

"ఒక ఆలోచన వచ్చిందిరా, ఎక్కువగా వాడే ఆర్కిడ్స్, లిల్లీలు కాకుండా మన దేశవాళి పూలతో, మల్లెలు మొగలిపొత్తులతో అలంకరణ సాధ్యం చేయరా, ఎథినిక్ బ్యూటీ వుంటుంది. ఆలోచించు, సాధ్యాసాధ్యాలు!"

"ఇది డెఫినెట్‌గా కొత్త ప్రయోగమవుతుంది. పూలు దొరకటం కష్టం అవుతుంది. అయినా చాలా సమయం వుంది గదా, ప్రయత్నిస్తా!"

***

మందారయ్య కుటుంబం చాలా పెద్దది. కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనమరాలుతో శాఖోపశాఖలైన పెద్ద కుదురు, పెద్ద లోగిలి అనిపించినా ఎవరి వంటా వార్పు వారిదే. సమష్టిలో వ్యష్టి కుటుంబం. అనాదిగా ఆ యింటిలో ఆడవారికి అందరికి పూలపేర్లే వుంటాయి. పెండ్లికి పూర్వం వేరే పేరు వుంటే ఆ యింటికి వచ్చాక పెండ్లి తరువాత ఏదో ఒక పూవు పేరు పేరుగా మారిపోతుంది. అది ఆ యింట ఒక ఆచారంగా మారిపోయింది.

పారిజాతం, కమల, పద్మ, సంపంగి, జాజి, శశి, కుసుమ, చంపకం, పుష్ప, నీలాంబరి, కనకాంబరం, శిరీష, దేవకాంచన. మాలతి, రాధా మాదవం, చమేలి, రోజా అన్నీ ఆ యింట్లోని ఆడవారి పేర్లే.

వూరు పక్కగా గుండ్లకమ్మ నది ప్రవహిస్తుంది. గుండ్లకమ్మ నది ఒడ్డువెంట మందారయ్య కుటుంబం పొలాలు. ప్రతి సంవత్సరం నదికి వరదలు వచ్చేవి. గుండ్లకమ్మ వరదలతో తోటలలో ఒండ్రు పట్టేది. పూల తోటలకు వేరే ఎరువు అవసరం అయేది కాదు. సంవత్సరానికి రెండుసార్లు పూల కాపు. విరగబూసేవి తోటలు. అటు మద్రాసు, ఇటు విజయవాడదాకా పూల వ్యాపారం. మందారయ్య కుటుంబానికి పూలకు ఏదో జన్మాంతర సంబంధం వుందని విశ్వాసం.

"ఏ మంచి పూవులను ప్రేమించినామో
నిను మోసె ఈ తల్లి భూమి గర్భమున" అన్నది వారి విశ్వాసం. వారి కుటుంబ ప్రస్తావన వచ్చినప్పుడల్లా గోపయ్య ఈ పద్యాన్ని తరచుగా పాడేవాడు.

గోపయ్య అనే గోపాల చక్రవర్తి, చిన్నతనంలోనే కాశి వెళ్ళి, కాశి విద్యాపీఠంలో అధ్యయనం చేసివచ్చిన పండితుడు. లోకజ్ఞాని. ఆయన గ్రహణశక్తి అమోఘం.

పుస్తక నిరపేక్షకంగా గడగడా పద్యాలు, శ్లోకాలు సందర్భానికి అన్వయిస్తూ చెప్పేవాడు. సాహిత్య సంపదలో పై అంతస్తులో వున్నట్లు వుండేవాడు.

పింజె బోసిన నీరుకావి ధోవతి కట్టుకొని, అలాంటిదే ఉత్తరీయం కప్పుకొని, గంధాక్షతలతో తలబొట్టు, కుడిచేతి అనామిక వేలికి దక్ష ముడి ఉంగరంతో ఆకర్షణీయంగా కరణంగారి అరుగు మీద కూర్చునేవాడు- ఆకర్షణీయమైన మూర్తి.

శుభానికి, అశుభానికి, మంచిరోజుకు, శాంతి, బారసాలనీ ఆయన్ను సంప్రదిస్తూండేవారు. వ్యక్తిగత సమస్యలను, కుటుంబ సమస్యలను చర్చించి ఆయన సలహా పొందేవారు. ఛాయా మాత్రంగా కౌన్సిలింగ్ చేసేవారు.

ఏరువాక ఎప్పుడు సాగాలో, అమ్మవారి కొలుపులు ఎప్పుడు అంకురార్పణ చేయాలో, నెలపొడుపు ఎప్పుడు ఇత్యాది విషయాలకు ఆయనే నిర్ణయ విధాత. కుటుంబంలో సమస్యలు తలెత్తితే పెద్ద మనస్సుతో పరిష్కరించి సమ్మతింపచేసేవాడు.

లోకోత్తర అనుభవంతో అందరిని సమ్మోహనపరిచి కట్టిపడవేసేవాడు. కొందరయితే పనులు మానుకొని వింటూ కూర్చుండిపోయేవారు. పొలం తగాదాల జోలికి పోయేవాడు కాదు.

ఉదయాత్పూర్వమే ఓగిరాల వారి వీధిలో అరుగుల మీద కూర్చొని, వారి వేదాధ్యయనం వినడం పరమప్రీతి. వారి, క్రమం,

జట, ఘన వేదస్వరం పదం ఆయన చెవిన పడితే మనోల్లాసం వందరెట్లు పెరిగినట్లు వుండేవాడు.

"ఒగిరాల వారి వీధిలోకి వెళ్ళి ఉదయమే ఒక గంట వేదం వింటూ గడపండిరా!" అని ప్రోత్సహించేవాడు.

అంతటి మూర్తిమంతుడు పొగచుట్టకు లొంగిపోయేవాడు.

పొగచుట్టను 'జ్ఞానకాష్టం'గా సంబోధిస్తాడు. కరణంగారి అరుగు మీద కూర్చొని 'అబ్బీ నిప్పు తేరా జ్ఞానకాష్టం వెలిగించాలి' కేక వేసి లోపలినించి నిప్పు కణికలు తెప్పించుకొనేవాడు.

పొగచుట్టను తన్మయత్వంతో ఆస్వాదించేవాడు ఆయన 'జ్ఞాన కాష్టం' వెలిగిస్తే బుద్ధి వొరిపిడి వచ్చేది. వ్యవహారంలో మంచి యెత్తులు వచ్చేవి. మంచి కవిత్వమూ వచ్చేది.

నిరుపహతి స్థలం వుంటేనే కవిత్వం పొంగివచ్చేది. ఉపాసనావరు లైనవారు వచ్చినప్పుడు తాంత్రిక చర్చలు జరిగేవి.

లలితా త్రిపురసుందరికి ప్రీతికరమయిన కదంబవనం, తెనుగులో కడిమివంగాను కడిమి వచోత్తరంగా 'కడియం'గా మారిందని, అదే గ్రామం పూలనర్సరీకి పూలకు ప్రసిద్ధమయిందని ఆంధ్రులకు అమ్మ వారికి- అమ్మవారికి పూలకు అనుబంధం ఏర్పడిందని- కడిమి పూలు త్రిపురాంతకంలోనే వున్నాయని సిద్ధాంతీకరించారు.

'కదంబ మంజరీక్షిప్త కర్ణపూర మనోహరా' కడిమిపూల గుత్తి చెవి ఆభరణంగా అమ్మవారి అలంకార ప్రస్థిగా చెప్తూ

"నానా సూన వితాన వాసనల నానందించు సారంగమేలా!
నన్నొలదటంచు గంధఫలి"

'నవచంపకాన్ని ముక్కతిమ్మన 'గందఫలి' తెనిగించిన విధానాన్ని సాహిత్యంలో పూల సౌరభాన్ని వివరించేవాడు. అందరికి అర్థమయే రీతిలో సాహిత్యాన్ని విడమరచి చెప్పేవారు.

***

రాజు ఎథినిక్ బ్యూటీ అనేప్పటికి మా వూరు గుర్తుకు వచ్చింది. ఎన్నాళ్ళయింది?? వూరు వెళ్ళాలంటే పాసింజరు రైలు ప్రయాణం తప్పనిసరి. పాసింజరు రైలు పెదవడ్లపూడిలో ఆగేప్పటికి మల్లెల గుబాళింపు! చిన్నచిన్న దొన్నెలలో మల్లెలు, బుట్టలతో మల్లెదండలు, విరజాజుల దండలతో ఒకసారిగా పూల గుబాళింపు. 'ఓహో! పెద వడ్లపూడి వచ్చిందా?' అనే గుర్తింపు పూల సువాసన వలనే వచ్చేది. ఎంత హాయి అనిపిస్తుందో! బాపట్ల, స్టూవ ర్టుపురం, ఈపూరుపాలెం స్టేషన్లలో కనకాంబ రాలు, మరువం, దవనం వచ్చేవి. మొగలిరేకు లు చిన్నగుంజాంలో వచ్చేవి. పూలబుట్టలు కనులకు ఇంపుగా వుండేవి.

అలాగే సంపెంగపూలు బుట్టలతో రైలంతా పూలసౌరభాలు 'నవచంపక పుష్పాభ నాసాదండ' విరాజిత అమ్మవారి నాసిక వర్ణనను, పూలతో మమేకమైన జీవన ప్రయాణ విశేషాన్ని ఊహించు కొంటే ఎంతో సంతోషం కలుగుతుంది.

పూల కలక్షను పుణ్యమాని ఎన్నో సంవత్సరాల తరువాత వూరు వెళ్ళేపని ఏర్పడింది. రచ్చబెట్టు, దేముడుబావి, రామ్మే డ, వేణుగోపాలస్వామిగుడి, శివాలయం ఏడె ద్దులగయి, అన్ని మనసులో మెదిలాయి.

గోపయ్యగారి ప్రభావం అందరి మీద వుంది.

అంతటి పండితుడి సంసార జీవనంలో అపశ్రుతులు వున్నాయి. నిరాదరించే భార్య "నీది నిరర్థక జీవితం ఎటువంటి ఉపయోగం లేదు. కాశిలో చదివినా ఊరిలోని అరుగులకే అంకితమ య్యావు" అని తరచు ఎత్తిపొడిచేది.

వున్న కొద్దిపాటి తూర్పు పొలాన్ని కౌలుకిచ్చేవాడు. దానిమీదే జీవనాధారం ఆయనది.

"నాకు అంతకంటే ఆశలేదు, భగవంతుడు ఈ మాత్రం ఇచ్చాడు, ఇది కూడా లేనివారు మన ఎదురుగానే వున్నారు" అనే సమాధానం గోపయ్య నుంచి వచ్చేది.

కాలక్రమేణా మేనమామలు ఆదరించి గోపయ్య కొడుకును తీసుకెళ్ళి చదివించారు. డాక్టరయి- ఎం.డి. చేసి మానసిక రోగాల లో సుప్రసిద్ధ డాక్టరయినాడు. ఆయనను సంప్రదించాలంటే 500 రూపాయల ఫీజు. వైచిత్రి ఏమిటంటే గోపయ్య ఊరిలోని అరుగుల మీదే కౌన్సిలింగ్ ఇస్తుంటే కొడుకు రవిచంద్ర నగరంలో ఏ.సి. రూములో పెద్ద ఫీజుతో కౌన్సిలింగ్ ఇస్తున్నాడు.

కార్యకారణ సంబంధాలు ఇతమిద్దంగా నిర్ధారణ చేయలేము కాని, జీవితంలో ఒక దృక్పథం ఏర్పడ్డమూ, ప్రవృత్తి మార్గం గుర్తించు కోగలిగి డబ్బు సులభంగా సంపాదించుకోగలిగాడు గోపయ్య కొడుకు.

క్షుభితమైన నిత్య జీవితంలో ఆయన మనసు నిశ్చలంగా వుండేది. ఏదో సమాధి స్థితిలో వున్నట్లుండేవాడు గోపయ్య.

కొత్త సంగతులలో కొత్త విషయాలు చెప్పుతూ కొత్తచూపులు అలవర్చుతూ, కొత్తదారులు కనబరుస్తూ కొత్త ఆవేశం పురికొలిపే, కవులకు, పండితులకు చావు బతుకుల సంరంభమే కాని బతుకు తెరువు మాత్రం అంతరికమైన ఆవేదనే! గోపయ్య పరిస్థితి అదే!

అవకాశాలు వచ్చాయో, తరాలు మారాయో! జీవన విధానంలో, ఆలోచనా సరళిలో మార్పులు అనూహ్యంగా వచ్చాయి. నా స్థితి, రాజు, గోపయ్య కొడుకు ఇలా చాలా మందిలో పరిస్థితి మారి పోయింది. ఆర్థిక సమీకరణలు ఊహించనంత మార్పులు వచ్చాయి.

ఒంగోలు నుంచి కారులో బయల్దేరాను నేషనల్ హైవే స్వరూపం మారిపోయింది మధ్యలో వచ్చే వూళ్ళను గుర్తించలేకపోయాను. వెల్లంపల్లి నుండి పడమటి వైపుగా వెళ్ళాలి మా వూరుకు. అదే గుర్తు. తారురోడ్డు ఏర్పడ్డది వాహనాలతో రోడ్డు బాగా రద్దీగానే వున్నది.

రోడ్డు పక్కగా పొలాలన్ని పచ్చ పచ్చగా వున్నాయి. ఇదివరలో పొగాకు తోటలు, లేకపోతే మెట్ట పంటలు వుండేది. ఇప్పుడంతా మాగాణిగా మారిపోయింది. గుండ్లకమ్మ ప్రాజెక్టు ఏర్పడిందన్నారు.

మా వూరి కొండ దూరంగా కన్పిస్తున్నది. కొండ వూరిని చుట్టుకు న్నట్లుగా వుంటుంది. ఊహించని విధంగా గ్రానైట్ ఫ్యాక్టరీ లు వెలిసాయి. ఆ ప్రాంతం ఎక్కువగా ఫ్యాక్టరీలమ యమయింది. వాటి మధ్యగా వూరికి వెళ్ళే రోడ్డు వుంది. పెద్ద పెద్ద రాళ్ళ బ్లాకులను కోస్తున్న శబ్దంతో ప్రాంతమంతా ధ్వనిస్తోంది, రేగుకాయలు పండే నేలలు పారిశ్రామిక వాటికలుగా మారిపోయాయి.

ఊరిలోకి వెళ్ళే రోడ్డు కొండ అంచుగా వెళ్తుంది. ఎదురయిన దృశ్యానికి సంభ్ర మాశ్చర్యాలు కలిగాయి. పెద్ద జలాశయం కొండను కౌగలించుకుంది. కారు ఆపి దిగాను.

ఒక ప్రశాంతత మహత్తర ఆనందం ఆవిరి అయిపోయింది. ఊరు అదృశ్యమ యింది మొత్తం జలార్ణవమయింది. గుండ్లకమ్మ జలాశయం ఊరిని మింగేసింది.

మల్లెపూదోటలు, నారింజ తోటలు, తోటకూర మడులు, జలసమాధి అయ్యాయి. వూరు వలసపోయింది. అనుభూతులు అనుభవాలు జలార్ణవ అలల్లా కదిలాడాయి.

అంతటా ఆనందం, చుట్టూ నవ్వులు మధ్యలో సన్నని ఏడుపు, అంతటా వెలుగు మధ్యలో చీకటి లోపల మనో కేంద్రంలో బాధ.

'ప్రాప్తవ్య మర్థం లభతే మనుష్యః'

మనిషికి ఎంత ప్రాప్తమో అంతే చేకూరుతుంది గోపయ్య మాట లు పదే పదే మార్మోగుతున్నాయి.

కాలక్రమేణా మేనమామలు ఆదరించి గోపయ్య కొడుకును తీసుకెళ్ళి చదివించారు. డాక్టరయి- ఎం.డి. చేసి మానసిక రోగాలలో సుప్రసిద్ధ డాక్టరయినాడు ఆయనను సంప్రదిం చాలంటే 500 రూపాయల ఫీజు. వైచిత్రి ఏమిటంటే గోపయ్య ఊరిలోని అరుగుల మీదే కౌన్సిలింగ్ ఇస్తుంటే కొడుకు రవిచంద్ర నగరంలో ఏ.సి. రూములో పెద్ద ఫీజుతో కౌన్సిలింగ్ ఇస్తున్నాడు.